సాక్షి తిరుపతి

ఆదివారం । 28 । జూలై । 2024



ఏమరుపాటే చంపేసింది!

పల్లె వెలుగు బస్సు డ్రైవర్ ఏమరు పాటే ఇద్దరిని బలితీసుకుంది. మరో 15 మందిని ఆస్పత్రిపాలు చేసింది. - 8లో



అద్వితీయం

అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నాటక పోటీలు సభికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

భాకరాపేట అటవీ ప్రాంతంలో అధికారులు శనివారం 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ



డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా కలెక్టర్

తిరుపతి అర్బన్: సామాజిక పింఛను దారులకు ఆగస్టు 1వ తేదీనే పింఛను అందజేస్తామని, ఇంటి వద్దే ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2,67,772 మంది పింఛనుదారులు ఉన్నారని, తొలిరోజు ఉదయం 6 గంటలకు పింఛను పంపిణీని ప్రారంభించి 99 శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన వారికి రెండో రోజు ఇవ్వాలని సూచించారు. ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ ఇంటి వద్దకే వచ్చి నగదు ఇస్తారని స్పష్టం చేశారు.

తగ్గిన పింఛన్లు 1,390

జూన్ నెలకు సంబంధించి 2,69,162 మంది పింఛనుదారులు ఉండగా వారికి జూలై నెల మొదటి వారంలో నగదు అందజేశారు. జూలై నెలకు సంబంధించి 2,67,772 మందికి ఆగస్టు మొదటి వారంలో ఇవ్వనున్నారు. జూన్ నెలతో పోలిస్తే జూలై నెలకు 1,390 పింఛన్లు తగ్గాయి. కొద్ది రోజులుగా పింఛన్లు తగ్గిస్తారని ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో జూలై నెల పింఛనుదారులు 1,390 మంది తగ్గడంతో అంతా ఆందోళన చెందుతున్నారు. దీనిపై అధికారులు వివరణ ఇస్తూ వారు మృతి చెందారని తెలిపారు.

రెండు కేంద్రాల్లో ఏపీపీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్: నగరంలో రెండు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు నిర్వహించనున్నట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్‌మోహన్ తెలిపారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్లో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలలో 3,142 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్టు వెల్లడించారు. రెండు షెషన్లలో పరీక్ష ఉంటుందన్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు. ఏపీపీఎస్సీ అధికారులు గిరిజారాణి, యశోధ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పరిశ్రమల్లో భద్రత తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శనివారం పరిశ్రమలకు చెందిన ఉత్పత్తుల ఎగుమతుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు జాప్యం లేకుండా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే దరఖాస్తు దారులకు వివరించాలని చెప్పారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అందిన దరఖాస్తులను పరిశీలించి 190 యూనిట్లు మంజూరు చేశామని, 96 గ్రౌండింగ్ అయ్యాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఐఐసీ తిరుపతి స్పెషల్ జోన్ మేనేజర్ విజయరత్నం, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణారెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, ఎల్డీఎం విశ్వనాథరెడ్డి, డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వం రైతులను గాలికొదిలేసింది. వారికి సంబంధించిన ఒక్కో పథకానికి మంగళం పాడేస్తోంది. పంటకు.. గిట్టుబాటు ధరకు.. పరిహారానికి.. కౌలురైతుకు ఎంతో మేలు చేకూర్చే ఈ క్రాప్ నమోదునూ పట్టించుకోకుండా మిన్నకుండిపోయింది. ఫలితంగా రైతులకు అందాల్సిన సంక్షేమం ఆగిపోయింది. దీనిపై ఎలాంటి మార్గదర్శకాలు లేవంటూ యంత్రాంగం సైతం చేతులెత్తేసింది. పుణ్యకాలం ముగిశాక హడావుడి పెడితే ఏం లాభమని రైతాంగం పెదవి విరుస్తోంది.



గత సీజన్‌లో ఈ క్రాప్ చేయించుకుంటున్న రైతులు

మాకొద్దు ఈ-పంట!

ఈ క్రాప్‌కు బ్రేక్

- కూటమి ప్రభుత్వం నుంచి అందని గ్రీన్‌సిగ్నల్
- ప్రతి ఏటా ఖరీఫ్ ప్రారంభంలోనే ఈ-క్రాప్
- వ్యవసాయ పథకాల రాయితీలకు ఇదే ఆధారం
- మార్గదర్శకాలు వస్తేనే అంటున్న అధికారులు
- గత ఏడాది 7,980 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు
- కార్డులు ఉంటేనే బ్యాంక్ రుణాలు, పథకాల్లో రాయితీలు

తిరుపతి అర్బన్: కూటమి ప్రభుత్వం ఈ క్రాప్ పథకానికి గండి కొడుతోంది. గడిచిన 2019 నుంచి 2023 వరకు రబీ, ఖరీఫ్ రెండు సీజన్లలో రైతులు ఏయే పంటలు సాగుచేశారనే లెక్కల కోసం పంట ఈ–క్రాఫ్ పేరుతో పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. దీంతో రైతులకు అందాల్సిన రాయితీ విత్తనాలు, ఎరువులతో పాటు గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు, బ్యాంక్ నుంచి రైతులకు రుణాలు, ఇన్‌పుట్‌సబ్సిడీ తదితర ప్రయోజనాలు అన్నదాతకు చేకూరేవి. ఖరీఫ్ సీజన్(జూన్–సెప్టెంబర్)కు సంబంధించి ప్రతి నెలా జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 15వ తేదీకల్లా ఈ–క్రాప్ ప్రక్రియను మండలాల వారీగా ఏవోల నేతృత్వంలో రైతు భరోసా కేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్ పూర్తి చేసేవారు. ఆ మేరకు రైతులు బ్యాంక్‌లో పంట రుణాలు పొందేవారు. అయితే ఈ ఏడాది జూలై ముగుస్తున్నా ఈ–క్రాప్ ప్రారంభం చేయలేదు. మరో నెల రోజులకు రైతులకు పంట చేతికి వస్తుంది. ఈ క్రమంలో గిట్టుబాట ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం ప్రశ్నార్థకంగా మారనుంది. అంతే కాదు బ్యాంక్ నుంచి రుణాలు పొందలేని దుస్థితి ఏర్పడుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలకు గండిపడనుంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అరకొరగా గుర్తింపు కార్డులు

గత ప్రభుత్వం 7,970 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించింది. దీంతో సాధారణ రైతులతో సమానంగా వారికి ప్రభుత్వం నుంచి రైతు భరోసాతోపాటు రాయితీ విత్తనాలు, ఎరువులు, బ్యాంక్ రుణాలు, గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు, పంట బీమా తదితర అన్ని ప్రభుత్వ పథకాలు వర్తింపజేశారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు 2,960 మందికి మాత్రమే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ క్రమంలో ఈ సీజన్‌కు బ్యాంక్‌ల నుంచి క్రాప్ రుణాలు పొందాలంటే సాధ్యమేనా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అధికారులు మాత్రం పదివేల కౌలు రైతుల కార్డులు టార్గెట్ ఇచ్చారని, వాటిని పూర్తి చేస్తామని చెప్పకొస్తున్నారు.



గత సీజన్‌లో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు (ఫైల్)

ఈ క్రాప్‌తో ప్రయోజనాలు

- పంటల బీమా వర్తిస్తుంది
- పంటకు బ్యాంక్ రుణాల మంజూరు
- పంటకు నష్టపరిహారం
- పంటకు మద్దతు ధర
- ఆర్బీకేల్లో ఎరువులు, పురుగు మందులకు రాయితీ
- ఈ ఖరీఫ్‌లో సాగు వివరాలు (హెక్టార్లలో)

వరి –17,023	వేరుశనగ–2456
సజ్జ – 1544	చెరుకు–1250
నువ్వులు–79	మొక్కజొన్న–23
ఇతర పంటలు–33	
మొత్తం	22,408 హెక్టార్లు
ఉద్యానపంటలు	25 వేల హెక్టార్లు

సేద్యం కష్టమే

ఈ ప్రభుత్వంలో సేద్యం చేయడం కష్టంగా మారుతోంది. గత ప్రభుత్వంలో విత్తనాల నుంచి ధాన్యం కొనుగోలు వరకు ప్రభుత్వం బాధ్యతగా చూసుకుంటూ ఉండేది. తెలుగుగంగ నీటిని ఏడాదిలో ఎప్పుడూ లేని విధంగా 2019–2023 వరకు రెండు సీజన్లకు అందించింది. దీంతో జిల్లాలో లక్ష ఎకరాలు అదనంగా సాగులోకి వచ్చాయి. క్రమంతప్పకుండా రైతు భరోసా ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో రైతులను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. భరోసా లేదు. ఉచిత పంటల బీమా లేదు.

–శ్రీనివాసులు, ముచ్చివోలు గ్రామం, శ్రీకాళహస్తి మండలం

మార్గదర్శకాలు వస్తేనే



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదుకు ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎటువంటి మార్గదర్శకాలు అందలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడగానే ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను చేపడతాం. గత ఏడాది 7,970 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 2,960 మందికి అందించాం. మొత్తం పదివేల మందికి ఇవ్వాలని టార్గెట్ ఉంది.

– ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

మరింత మెరుగ్గా పాస్‌పోర్టు సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న శివహర్ష

తిరుపతి అర్బన్: పాస్‌పోర్ట్ సేవలను మరింత మెరుగుపరుస్తామని ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష తెలిపారు. ఆయన శనివారం లక్ష్మీపురం సర్కిల్‌లోని పాస్‌పోర్ట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య క్రమేణా పెరుగుతోందని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాల ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జాప్యం లేకుండా పాస్‌పోర్టులను డెలివరీ చేస్తున్నామన్నారు. పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులకు మరింత సమర్థవంతమైన, పౌర –స్నేహపూర్వక అనుభవాన్ని అందజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. స్ట్రీమ్‌లైన్డ్ ప్రాసెసింగ్ కోసం విజయవాడ నుంచి కేంద్రీకృత పరిపాలన దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. విజయవాడలో టర్న్ అరౌండ్ టైమ్‌లను తగ్గించి పాస్‌పోర్ట్‌ల ప్రింటింగ్ జరుగుతోందని, తిరుపతిలోని పాస్‌పోర్ట్ సేవా కేంద్రంలోను పలు సౌకర్యాలను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. తమకు ఏపీ పోలీసు, తపాలా శాఖ సహకరిస్తున్నాయని కొనియాడారు. ఈ ఏడాది జూన్‌లో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2023–24 సంవత్సరానికి పౌరులకు అసాధారణ ఉత్తమ ప్రమాణాల సేవలను అందించినందుకు ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం విజయవాడకు ఉత్తమ కార్యాలయంగా అవార్డ్ ప్రదానం చేసిందని తెలిపారు.

బీటెక్ డ్యూయల్ డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ, స్వీడన్‌కు చెందిన బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించే బీటెక్ డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లో ఆగస్టు 1వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్టు వర్సిటీ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్ డ్యూయల్ డిగ్రీలో చేరే విద్యార్థులు మూడేళ్ల పాటు మహిళా వర్సిటీలో కోర్సు చదవాల్సి ఉంటుందని, మరో ఏడాది స్వీడన్‌లోని బ్లేకింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యనభ్యసించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్‌లో 70 శాతం మార్కులు సాధించి, ఏపీ ఈఏఎంసెట్–2024లో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు మహిళా వర్సిటీలోని డీన్, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆఫీసులో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు మహిళా వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ లేదా 7995973878, 9390934349లో సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్యం మెరుగుపడాలి



కంపార్ట్‌మెంట్లను పరిశీలిస్తున్న అదనపు ఈఓ వెంకయ్య చౌదరి

తిరుమల: కంపార్ట్‌మెంట్లలో పారిశుద్ధ్యం మెరుగుపడాలని టీడీపీ అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. ఆయన శనివారం తిరుమలలోని పలు క్యూలు, నారాయణగిరి షెడ్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లను తనిఖీ చేశారు. నారాయణగిరి ఉద్యానవనాల్లోని భక్తులు వేచి ఉండే షెడ్లు, క్యూ, లగేజీ, మొబైల్ డిపాజిట్ కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు, భక్తులకు అందుతున్న అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు, పారిశుద్ధ్యం తదితరాలను పరిశీలించారు. కంపార్ట్‌మెంట్లలో పారిశుద్ధ్యం మరింత మెరుగు పరచాలని సూచించారు. కంపార్ట్‌మెంట్లలో భక్తులకు శ్రీవారి సేవకు లు అందిస్తున్న సేవలను పరిశీలించి వారిని ప్రశంసించారు. అనంతరం వైకుంఠం క్యూకాంప్లెక్స్ – 1, తిరుమల నంబి ఆలయం, ఆలయ పరిసరాలను పరిశీలించారు. దర్శనం క్యూ విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, వీజీఓ నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు పాలు పంపిణీ చేస్తున్న అదనపు ఈఓ

కౌలురైతుపై దాష్టీకం

- 1.96 ఎకరాల్లోని సజ్జ పంటను దున్నేసిన యజమాని



దున్నేసిన సజ్జ పంట వద్ద కౌలు రైతు కృష్ణారెడ్డి

రేణిగుంట: కౌలు రైతు సాగుచేసిన పంటను కౌలుకు ఇచ్చిన భూయజమానే దౌర్జన్యంగా పంటను ట్రాక్టర్‌తో దున్నేసిన ఘటన మండలంలోని కరకంబాడి పంచాయతీ, గొల్లపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని గొల్లపల్లి సమీపంలో కరకంబాడి రెవెన్యూ పరిధిలో సర్వే నం.254–1, 263–5లో ఉన్న 1.96 ఎకరాలను గొల్లపల్లికి చెందిన హేమలత కుమారుడు తేజకృష్ణారెడ్డి కుమారుడు దామోదర్‌రెడ్డికి 2021లో ఏడాదికి రూ.20వేలు కౌలు చెల్లించే విధంగా 2025 మార్చి వరకు కౌలుకు ఇస్తూ లీజు అగ్రిమెంట్ రాసుకున్నారు. ప్రతి ఏటా ఒప్పందం ప్రకారం లీజు మొత్తం రూ.20 వేలు చొప్పున చెల్లించి పంట పెట్టుకున్నారు. గత ఏడాది కౌలుదారు దామోదర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. అయితే దామోదర్ రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి లీజు ఒప్పందం మేరకు లీజు రూ.20వేలు చెల్లించి ఈ ఏడాది జూన్‌లో పొలంలో సజ్జ పంట వేశాడు. పంట చేతికొచ్చే సమయంలో గురువారం గ్రామానికి చెందిన యుగంధర్, రవి, రమణయ్య సహకారంతో భూయజమాని తేజ తల్లి హేమలత ట్రాక్టర్‌ను తీసుకొచ్చి దౌర్జన్యంగా సజ్జ పంటను పూర్తిగా దున్నేసింది. తల్లి, కుమారుడు మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా అధికారికంగా లీజు చెల్లించి పంట పెడితే వచ్చి నష్టం చేకూర్చడం దుర్మార్గమని కౌలురైతు కృష్ణారెడ్డి వాపోయాడు. రూ.50 వేలు పంట నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు రేణిగుంట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 27 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 65,980 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 27,441 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.21 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం కలుగుతోంది.

11 మామిడి మండీలు దగ్ధం

- సుమారు రూ.80 లక్షల వరకు ఆస్తి నష్టం



మంటల్లో కాలిపోతున్న మామిడి మండీ



మంటల్లో కాలి బూడిదైన మామిడి మండీ

పాకాల: మండలంలోని దామలచెరువులో ఉన్న మామిడి మండీల్లో 11 మండీలు అగ్నికి ఆహుతయ్యాయి. శనివారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో షార్ట్‌సర్క్యూట్ కావడం వల్ల మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తిరుపతి డీఎఫ్ఓ వీ.రమణయ్య ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది పాకాల, పీలేరు, తిరుపతి, చిత్తూరు నుంచి నాలుగు అగ్నిమాపక వాహనాలతో మంటలార్పారు. మండీల్లో బీరువాలు, మామిడి తోటలకు మందులు కొట్టే యంత్రాలు, కొన్ని మండీల్లో ద్విచక్ర వాహనాలు పూర్తిగా ఆహుతయ్యాయి. మండీలకు పక్కనే ఉన్న ఎస్.మహబూబ్‌బి అపార్ట్‌మెంట్‌లో ఉన్న రియాజ్‌అలీ, ఇంతియాజ్, మునాఫ్, మొబీనా ఇళ్లలోకి మంటలు వ్యాప్తించాయి. ఆయా ఇళ్లలోని గృహోపకరణాలు మంటల్లో కాలిపోయాయి. గాలులు విపరీతంగా వీయడంతో మంటలు అధికమయ్యాయి. ఎంత ప్రయత్నించినా మంటలు ఒక మండీ నుంచి మరో మండీకి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.80 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉటుందని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి మంటల్లో కాలిపోయిన మండీలకు నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

క్లుప్తంగా

టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మృతి


రమేష్ చంద్ర ప్రసాద్(ఫైల్)

నింద్ర: తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు రమేష్ చంద్ర ప్రసాద్(77) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఈయన ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షులుగా పనిచేశారు. గత నెల రోజుల క్రితం గుండెకు సంబంధిత ఆపరేషన్ చేసుకున్నారు. చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో వైద్యం పొందారు. వారం రోజుల క్రితం స్వగ్రామం అయిన ఊరూరుపేటకు వచ్చారు. అయితే రాత్రి గుండెపోటు రావడంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


సినీ రచయిత విజయేంద్రప్రసాద్


తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం సినిమా రచయిత విజయేంద్రప్రసాద్, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

డ్రైవర్ ఏమరుపాటే చంపేసింది!

- వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- ట్రాలీని ఢీకొట్టిన పల్లెవెలుగు బస్సు
- ఇద్దరి మృతి, 15 మందికి గాయాలు
- క్షతగాత్రులందరూ తిరువళ్లూరు జిల్లా వాసులే అధికం..


నిలిచి ఉన్న ట్రాలీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు (ఇన్‌సెట్) మృతి చెందిన ఝాన్సీ (ఫైల్)

చిల్లకూరు: డ్రైవర్ ఏమరుపాటు ఇద్దరిని బలి తీసుకుంది. మరో 15 మందిని ఆస్పత్రిపాలు చేసింది. ఈ ఘటన చిల్లకూరు మండలంలోని జాతీయ రహదారి, వరగలి క్రాస్ రోడ్డు సమీపంలోని టీఎస్‌ఆర్ కోల్డ్ స్టోరేజ్ ఎదురుగా శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. తమిళనాడు రాష్ట్రం, తిరువళ్లూరు జిల్లా, ఊత్తుకోట మండలం, ఎస్‌ఆర్ కండ్రిగకు చెందిన 12 మంది నెల్లూరు జిల్లా గొలగమూడిలోని వెంకయ్యస్వామిని దర్శించుకునేందుకు బయలుదేరారు. వారు ముందుగా సూళ్లూరుపేటలో దిగి అక్కడ పల్లెవెలుగు బస్సు ఎక్కారు. వీరితో పాటు మొత్తంగా 36 మంది బస్సులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో పల్లెవెలుగు బస్సు కోల్డ్ స్టోరేజ్ వద్దకు వచ్చే సరికే ఆ ప్రాంతంలో రోడ్డు పక్కనే నిలిపిన కొత్త జేసీబీ లోడ్డుతో నెల్లూరు వైపు వెళుతున్న ట్రాలీని వేగంగా ఢీకొట్టింది. దీంతో పల్లెవెలుగు బస్సు కండక్టర్ సీట్ వరకు పూర్తిగా ట్రాలీలోకి దూసుకుపోయింది. రెండో సీట్‌లో కూర్చున్న ఝాన్సీరాణి (24) అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె తండ్రి కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా.. నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. అలాగే నరసారావుపేటకు చెందిన అబుదల్ రఫూప్ తీవ్రంగా గాయపడ్డాడు. మాన్నరు పోలూరుకు చెందిన పోలయ్య, నెల్లూరు స్టోన్‌హౌస్ పేటకు చెందిన మన్మద్‌కుమార్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఊతుకోట మండలం, ఎస్‌ఆర్ కండ్రిగకు చెందిన భక్తాచలం, శంకర్, మనీషా, మదుబాల, రూబిన్, కోటేశ్వరి, అనార్కళితో పాటు నెల్లూరుకు చెందిన నిషాద్‌అహ్మద్, ప్రకాశం జిల్లా, కొండేపికి చెందిన రమణయ్య, వేగూరుకు చెందిన చిన్నయ్యను గూడూరు ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను 108లో గూడూరు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సహాయక చర్యలు ముమ్మరం

ప్రమాదం జరిగిన వెంటనే గూడూరు రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐ సుధీర్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. బస్సులోనే మృతిచెందిన ఝాన్సీని బయటకు తీశారు. ఆపై ఆటోలో ఎక్కించేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో సీఐ చొరవ చూపి ఆటోలో ఎక్కించారు. గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల సమాచారాన్ని స్థానిక ఆర్డీఓ కిరణ్‌కుమార్‌కు చేరవేశారు. అలాగే చిల్లకూరు తహసీల్దార్ శ్రీనివాసులు, గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయడంలో సహకారం అందించారు.

నీటి గుంతలోపడి కార్మికుడి మృతి


దీపక్ మృతదేహం

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట ఎఫ్‌సీఐ గోదాము సమీపంలోని చెరువులో ఉన్న గుంతలో పడి ఓ కార్మికుడు శనివారం మృతిచెందాడు. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు అందించిన వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, గోండా జిల్లా, కటౌలి పోలీస్‌స్టేషన్ పరిధి, కొడియా తహశీల్‌కు చెందిన దీపక్(22) మండలంలోని సీతారాంపేట సమీపంలోని ఎఫ్‌సీఐ గోదాములో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం 6 గంటలకు బహిర్భూమికి వెళ్లి నీటి కోసం చెరువులోకి దిగి మునిగిపోవడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో దీపక్ అక్కడికక్కడే మృతిచెందాడు. కొంతసేపటికి అక్కడకు చేరుకున్న తోటి కార్మికుడు గుర్తించి సమాచారాన్ని గోదాము మేస్త్రీ హితేష్ కుమార్‌కు అందించాడు. ఆపై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దీపక్ మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

శ్రీసిటీలో అలరించిన గజేంద్ర మోక్షం కథా ప్రవచనం


గజేంద్ర మోక్షం కథా ప్రవచనంలో బ్రహ్మశ్రీ కోట రాజశేఖర్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో శనివారం ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో నిర్వహించిన పోతన భాగవతంలోని గజేంద్ర మోక్షం కథా ప్రవచనం అలరించింది. నెల్లూరుకు చెందిన అష్టావధాన బ్రహ్మశ్రీ కోట రాజశేఖర్ తనదైన శైలిలో ఆధ్యాత్మిక వివరణలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చెన్నైలోని వేదవిజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరి మధు మాట్లాడుతూ కోట రాజశేఖర్ అందించిన లోతైన ఆధ్యాత్మిక విశ్లేషణలను కొనియాడారు. భారతదేశం గొప్ప ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రచారం చేయడంలో ఇటువంటి ప్రసంగాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు.


అష్టావధాని బ్రహ్మశ్రీ కోట రాజశేఖర్‌ను శ్రీవాణి సాహిత్య వేదిక ద్వారా సత్కరిస్తున్న ప్రతినిధులు

ఆధ్యాత్మిక సాహిత్య రచనలలో ఆయన కృషిని అభినందిస్తూ శ్రీసిటీ శ్రీవాణి తరపున రాజశేఖర్‌ను సత్కరించారు.

11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

భాకరాపేట : భాకరాపేట అటవీ ప్రాంతంలో వాహనం సహా 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు అధికారి దత్తాత్రేయ తెలిపారు. శనివారం సాయంత్రం భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాచారం మేరకు భాకరాపేట అటవీ ప్రాంతంలోని నాగపట్ల ఈస్ట్ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టామన్నారు. ఈ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు మోసుకొస్తున్న స్మగ్లర్లను గుర్తించి వారిని చుట్టుముట్టేందుకు పోలీసులు ప్రయత్నించారు. స్మగ్లర్లు ముందుగానే పసిగట్టి దుంగలు పడేసి పారిపోయారు. 11 దుంగలు స్వాధీనం చేసుకున్నట్టు ఫారెస్ట్ అధికారి తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంటుందన్నారు. దాడుల్లో డీఆర్వో వేణు, ఎఫ్‌బీవో రవి, రెడ్డెప్పరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

నాటు తుపాకీ స్వాధీనం
– ఇద్దరి అరెస్ట్


నాటు తుపాకీ, నిందితులతో పోలీసులు

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనంలో నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ తెలిపారు. ఆయన శనివారం ఎస్‌ఐ లక్ష్మీనారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తన సిబ్బందితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం నాగిలేరు సమీప అడవిలో జువ్వకమిట్ట పాంతంలో సోదాలు చేశారని తెలిపారు. ఈ క్రమంలో నారాయణవనం దిగువ గాండ్ల వీధికి చెందిన గోపిరెడ్డి, శ్రీనివాసులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారని తెలిపారు. వారిని వెంబడించి పట్టుకోగా వారి వద్ద ఎస్‌బీఎంఎల్ రకం పెద్ద నాటు తుపాకీని గుర్తించామన్నారు. దాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరినీ అరెస్టు చేసినట్టు వివరించారు. వారు నాటు తుపాకీతో అడవి జంతువులు, అడవి పందులను వేటాడి చంపి, మాంసాన్ని అమ్ముకుంటున్నట్లు తెలిసిందన్నారు. వారిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా నాటు తుపాకులు, నాటు బాంబులు కలిగి ఉన్నా నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా మారణాయుధాలను కలిగి ఉన్నా, జంతువులను వేటాడుతున్నా స్థానిక పోలీసులు లేదా 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

అద్వితీయం.. అభినయ నాటకోత్సవం


ఆకట్టుకున్న కళా నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్: అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నాటక, నృత్య పోటీలలో భాగంగా ఎనిమిదో రోజు శనివారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద బృంద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటికలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సుమారు 160 మంది కళాకారులు శాస్త్రీయ, జానపద నృత్యాలతో హోరెత్తించారు. మధ్యాహ్నం విజయవాడకు చెందిన శ్రీసాయిబాబా నాట్యమండలి వారు ప్రదర్శించిన పృథ్వీరాజ్ రాసో పౌరాణిక పద్యనాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం గుంటూరు అభినయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఇంద్రప్రస్థం సాంఘిక నాటిక ఆసక్తికరంగా సాగింది. తర్వాత శ్రీసాయి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన కౌసల్యాసుప్రజారామా సాంఘిక నాటిక సభికులను అలరింపజేసింది. ఈ సందర్భంగా కళాకారులను అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్.రెడ్డి జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కాగా చివరి రోజైన ఆదివారం ఉదయం 9.30 నుంచి నృత్య పోటీలు, సాయంత్రం 4 గంటలకు అభినయ ఆర్ట్స్ వారిచే శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణం పద్యనాటక ప్రత్యేక ప్రదర్శన నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటలకు విజేతలకు హనుమ అవార్డ్స్ ప్రదానం చేయనున్నారు.

సుమధురం.. ప్రియా సిస్టర్స్ గానామృతం


సంగీత కచ్చేరీలో ప్రియా సిస్టర్స్ బృందం

తిరుపతి కల్చరల్: శ్రీత్యాగరాజ ట్రస్ట్ భవనంలోని ఆడిటోరియంలో శనివారం ప్రదర్శించిన ప్రియా సిస్టర్స్ షణ్ముఖ ప్రియ, హరిప్రియ సుమధుర గానామృతం సభికులను ఆకట్టుకుంది. శ్రీత్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో త్యాగరాజ ట్రస్ట్ భవనంలోని ఆడిటోరియంలో చేపడుతున్న త్యాగరాజ సంగీతోత్సవాలు శనివారం మూడో రోజుకు చేరాయి. ఇందులో భాగంగా తొలుత ఎస్వీ సంగీత కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సంగీత కచ్చేరి అలరింపజేసింది. అనంతరం ప్రియా సిస్టర్స్ కచేరిలో త్యాగరాజ సంకీర్తనలను వినసొంపుగా గానం చేస్తూ శ్రోతులను మైమరిపించారు. వీరికి వయోలిన్‌పై వీవీ.శ్రీనివాసరావు, మృదంగంపై వీవీ.రమణమూర్తి, ఘటంపై డాక్టర్ కే.మురళి చక్కటి సహకారం అందించారు. తర్వాత తిరుమలై బ్రదర్స్ రంగాచారి, ఎంబార్ కస్తూరి బృందం ప్రదర్శించిన సంగీత కచ్చేరి సభికుల హృదయాలను రంజింపజేసింది. వీరికి వయోలిన్‌పై అనయంపట్టి వెంకటసుబ్రమణ్యం, మృదంగంపై కలకత్తా టీకే.కార్తీక్, కంజీర్‌పై డాక్టర శంకర్ సహకారం అందించారు. తర్వాత త్యాగరాజ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మోహన సుందరం, కంచి రఘురామ్, భీమాస్ అశోక్, శ్రీనివాసులు, ప్రభాకర్ సంగీత విద్వాంసులను జ్ఞాపికలు, శాలువలతో ఘనంగా సత్కరించారు.